# నిర్ణయం

"ప్రపంచీకరణ తెచ్చిన మార్పులు... ఆధునిక జీవనానికి కావలసిన సమీకరణలు... జన జీవితాల్లో ఊహించని మార్పులెన్నో తెస్తున్నాయి. ఆప్యాయతల్ని అనురాగాల్ని అవసరాలు డామినేట్ చేస్తున్నాయి.

తరాల అంతరాల మధ్య ఒదిగి పోయిన అనుబంధ బాంధవ్యాలు ఇరుకవుతున్న సమయాల మధ్య విలవిల్లాడుతున్నాయి.

**మనలోంచి మనం వేరై... జీవన యాంత్రికత నుండి విడివడి... విలక్షణమై... సామాజిక చైతన్యానికి పాటుపడాలి. మానవ సేవే మాధవ సేవ! సమాజ సేవకై కొంత సమయం వెచ్చించినా చాలు"**

రాత్రి ఎనిమిది దాటకముందే సభ మధ్యలోంచి బయటపడి ఇంటికి తిరుగుముఖం పడుతుంటే స్వామీజీ మృదు ప్రవచనాలు గుర్తుకొచ్చాయి.

వెర్రిగా నవ్వుకున్నాడు సాగర్. తన తల్లికి సేవలందించడానికే సతమతమవుతుంటే ఇంకెక్కడి సమాజసేవ?

వారం నుండి జరుగుతున్న ఆధ్యాత్మిక సమావేశాల్లోకి క్రమ తప్పక వెళుతున్నాడతను. మనసు సాంత్వన కోసం కాసేపు గడిపి వస్తున్నాడు.

"ఏమాలోచించారు?" ఇంట్లోకి అడుగుపెట్టడమే ఆలస్యం... భర్తను నిలదీసింది సుభాషిణి.

మౌనముద్ర దాల్చాడు. ఆమెను అర్థం చేసుకునే ప్రయత్నం చేస్తున్నాడు.

"నేను ఇంటి చాకిరి, వంట చాకిరి చేయాలి. అటు ఉద్యోగం వెలగబెట్టాలి. బోనస్‌గా అత్తయ్య బాగోగులు చూడాలి. నావల్ల కావడం లేదని ఎంత పోరు పెడుతున్నా చెవికెక్కించుకోరేం?" రుసరుస లాడింది.

"వృద్ధురాలైన కన్నతల్లి... ఎదిగిన ఒక్క కొడుకుని. నాదే కదా అమ్మ బాధ్యత.

నాలో సగభాగానివి నీకూ ఉంటుంది కదా భాగస్వామ్యం"

"కాదన్నానా?"

"నాది ఫీల్డ్ వర్క్ జాబ్. టూర్లెక్కువ. ట్రై టు అండర్‌స్టాండ్..."

"పోనీ జాబ్ మానేయనా?" సూటిగా ప్రశ్నించింది.

'అమ్మో? తనొక్కడి జీతంతో కుటుంబ జీవితాన్ని సర్దలేడు. భార్య పరిస్థితిని కూడా అవగాహన చేసుకోగలడు... ఇప్పటికెందరు పనివాళ్లు మారారో? మరి ఈ సమస్యకు పరిష్కారం మాత్రం తన దగ్గర లేదు. అందుకే ఆమెకే వదిలేస్తే?'

"సరే సుభా! ఏం చేద్దామో నువ్వే తేల్చు?"

"డే కేర్ సెంటర్‌లో వేయండి. నెలకి వెయ్యో... రెండు వేలో... పే చేద్దాం..." నిర్మొహమాటంగా చెప్పేసింది.

సాగర్ మనసు చివుక్కుమంది.

భర్త మౌనాన్ని మరోలా అర్థం చేసుకున్న సుభాషిణి "పిల్లల్ని హాస్టల్లోనే కదా ఉంచాం" అంది.

పిల్లల్ని హాస్టల్లో వేయడం... అమ్మ వార్ధక్యాన్ని వృద్ధాశ్రమంలో తోసేయడం... సమన్వయ పర్చాల్సిన అంశాలేనా? అలా అని తొందరపడి తీసుకోవాల్సిన నిర్ణయం కాదిది. కొడుకు తనాన్నే ప్రశ్నిస్తున్న మృదుకోణమిది.

"అమ్మను చూసుకునే బాధ్యత నీకు తప్పించాలి. అంతే కదా!" ఆధ్యాత్మిక సభల ప్రభావమేమో కాస్తంత సౌమ్యంగానే బదులిచ్చాడు.

"ఊఁ..." అంది పొడిగా.

"ప్లీజ్ సుభా! నన్ను ఇబ్బంది పెట్టక ఒక్కవారం రోజులు టైమివ్వు" అర్థింపుగా అన్నాడు. మౌనం అంగీకారంగా అక్కడి నుంచి నిష్క్రమించింది.

సాగర్ యథాలాపంగా ఒక నిట్టూర్పు వదలాడు. అనారోగ్యంతో మంచంలో జీవచ్ఛవంలా పడి వున్న కన్నతల్లి నొకసారి ఆప్యాయంగా పలకరించి వెళదామని... తల్లి గదిలోకి ప్రవేశించాడు.

✣ ✣ ✣

ఆదివారం ఉదయం ఎనిమిదవుతోంది.

ఆరింటికి రావాల్సిన పాలవాడింకా రాకపోవడంతో పాల పాకెట్ కోసం వీధి మలుపులో ఉన్న షాపుకి కాలినడకన బయల్దేరాడు సాగర్. మార్గమధ్యలో జనం గుమిగూడి ఉండడం గమనించి అక్కడ ఆగాడు. పలుచగా ఉన్న జనంలో దూరి ఏమిటని ఆసక్తిగా చూసాడు. ఓ నడి వయస్కురాలు స్పృహ తప్పి పడి ఉంది. గుర్తు పట్టాడు.

ఆమె నర్సవ్వ! గడప గడపకు తిరిగి రోజూ ఇడ్లీలు అమ్ముకుంటూ జీవనం సాగిస్తుంది. పిల్లలు యాక్సిడెంట్‌లో పోయారట. ఒంటరిగా ఉంటోంది. టిఫిన్ క్యాంటీన్‌లో కమీషన్‌కి ఇడ్లీలు తెచ్చి అమ్ముకుంటుంది.

జనం చోద్యంలా చూస్తున్నారే తప్ప ఎవరూ జోక్యం చేసుకోకపోవడంతో సాగర్ గబ గబా వెళ్ళి ఆటోని పిలిచాడు. ఒకరిద్దరి సాయంతో ఆమెని ఆటోలో పడుకోబెట్టి ఏరియా

ఆసుపత్రిలో జాయిన్ చేశాడు.

అరగంటలో కోలుకుందామె.

"నీ కడుపు చల్లగ ఉండాలి బాబూ!" నర్స్ ద్వారా విషయం తెలుసుకున్న నర్సవ్వ సాగర్‌కి రెండు చేతులెత్తి మొక్కింది.

వీధిలో వాళ్లు చెప్పే ప్రతి పని కాదనకుండా చేసి పెడుతుంది ఆమె. కూరగాయలు తెస్తుంది. స్కూల్ వ్యాన్ మిస్సవుతే పిల్లల్ని బడిలో వదిలిపెట్టి వస్తుంది. ఎవరైనా డబ్బివ్వబోతే తీసుకోదు. ఓ పూట భోజనం పెడితే మాత్రం కాదనదు.

ఇదంతా గుర్తుకు వచ్చి...

"వద్దమ్మా! నాకంటే వయస్సులోనే కాదు. సహాయం చేయడంలో కూడా గొప్పదానివి.

**నీవు పరులకు నిస్వార్థంగా చేస్తున్న సేవ ముందు నేను నీకు చేసిన సహాయం అంత గొప్పదేం కాదు"** అంటూ వెళ్లిపోయాడక్కడి నుండి.

✤ ✤ ✤

ఒక రోజు ఇల్లు వెతుక్కుంటూ వచ్చి గుమ్మం ముందు మౌనంగా నిలబడిన సాగర్‌ని చూసి.

"అలా నిలబడ్డావేం? ఏం కావాలి బాబూ?" అనడిగింది నర్సవ్వ.

"అమ్మ కావాలి..." అన్నాడు తలొంచుకుని.

స్థాణువైపోయిందా మాటకు. అతడేం మాట్లాడుతున్నాడో ఆవిడకేమీ అర్థమవక అలాగే కొయ్యబారి పోయింది.

"అవునమ్మా! మా అమ్మని అమ్మలా చూసుకునే ఓ అమ్మ కావాలి. మా అమ్మని ప్రాణంగా చూసుకునే ఓ అమ్మ కావాలి. మా అమ్మ వృద్ధాప్యానికి ఓ ఆసరా కావాలి. రోజంతా ఆమెకు తోడు కావాలి. కష్ట సుఖాలు చెప్పుకునేందుకో మనిషి కావాలి".

గుక్క తిప్పుకోకుండా చెప్పుకుపోతున్నాడు.

"మా ఇంట్లో ఒకదానివిగా ఉండాలి. నీ సేవకు వెలగట్టలేనేమో గానీ నీకేలోటు రాకుండా చూసుకునే బాధ్యత నాది" ఈ విధంగానైనా ఓ పేదరాలిని ఆదుకునే అవకాశం చిక్కిందనుకున్నాడు.

కాసేపు ఆలోచనల్లో పడిందామె.

ఆమె నిర్ణయం కోసం వేచి ఉన్నాడతను.

"నీ బాధ నాకర్థమయ్యింది. తప్పక మీ అమ్మకి సేవలందిస్తాను. నా సేవలు మీ అమ్మకే కాదు. ఎవరికి ఏ అవసరమొచ్చినా వారికి చేదోడు వాదోడుగా నిలుస్తాను. నేనందరిదానను. నన్ను కాదనకూడదు. అలాగే మీ అమ్మనూ కంటికి రెప్పలా చూసుకుంటాను" అందామె.

ఒప్పుకొని, ఆమెను వెంట తీసుకొని బయలుదేరాడు...

తను ఆమెకా... ఆమె తనకా... ఎవరికెవరు చేయూతగా నిలుస్తున్నారో... అర్థంకాని సంశయంలో పడుతూ...!!

**(01.02.2009)**

✻